క్లుప్తంగా

సీఐ సస్పెన్షన్‌కు డిమాండ్



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శాంతియుతంగా సమ్మె చేస్తున్న పారిశుధ్య మహిళా కార్మికులపై లాఠీచార్జి చేసిన వేదాయపాళెం సీఐ శ్రీనివాస రావును వెంటనే సస్పెండ్ చేయాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. నేతలు రామరాజు, షానవాజ్, మధు, మున్వర్, సుబ్బరాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

నెల్లూరు సిటీ: తనపై ముగ్గురు దాడి చేశారంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు యువకుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఆకుతోటకు చెందిన పురుషోత్తం అదే ప్రాంతంలోని వసంత్ వద్ద సెంట్రింగ్ పని చేస్తున్నారు. కొంతకాలంగా వసంత్, అతని సోదరుడు వినయ్ మధ్య విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో వసంత్ వద్ద పని చేయొద్దని వినయ్ సూచించారు. అయితే పురుషోత్తం మాత్రం వసంత్ వద్దే పనిచేస్తున్నారు. దీనిపై కక్ష పెంచుకొని పురుషోత్తంపై బన్నీ, సారథితో కలిసి వినయ్ ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. అడ్డుకోబోయిన పురుషోత్తం తల్లిపై సైతం దాడికి పాల్పడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా చదరంగ సమాఖ్య, రాయ్ చెస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన నెల్లూరు జిల్లా స్థాయి అండర్ – 13 బాలబాలికల చదరంగ పోటీల్లో విజేతలుగా హేమల్ వర్షన్, కీర్తన నిలిచారు. ద్వితీయ స్థానాన్ని యజ్ఞేశ్వరరెడ్డి, నాగ ఉజ్వలిత సాధించారు. మచిలీపట్నంలో వచ్చే నెల రెండు, మూడున నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలు పాల్గొననున్నారని చెప్పారు. విజేతలకు బహుమతులను కళాలయ డైరెక్టర్ గూడూరు లక్ష్మి, ఆనం పద్మనాభరెడ్డి అందజేశారు. ఆర్బిటర్లుగా మౌనిక, విష్ణు, పరిశీలకుడిగా ఫిడే ఇన్‌స్ట్రక్టర్ అజీజ్ వ్యవహరించారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించండి



నెల్లూరు(పొగతోట): విడవలూరు బిట్ – 2 ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నిబంధనల ప్రకారం అధికారులు విధులు నిర్వర్తించాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి వచ్చే ఒకటి వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. రెండున్న పరిశీలన ఉంటుందన్నారు. పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ఐదున ప్రకటించాలని పేర్కొన్నారు. 12వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అనివార్యమైతే 13వ తేదీ రీపోలింగ్‌ను జరపాలని తెలిపారు. 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రక్రియను సమర్థంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

త్వరితగతిన రీ సర్వే పూర్తి



నెల్లూరురూరల్: నెల్లూరు డివిజన్ పరిధిలో రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌తో కలిసి సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడారు. అన్నదాతా సుఖీభవ పథకంలో ఆధార్ వెరిఫికేషన్, డెత్ కేసులను పరిష్కరించాలని, తల్లికి వందనం పథకంలో రెవెన్యూపరంగా అనర్హులైన వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నూతనంగా గృహ నిర్మాణాల కోసం దరఖాస్తులను స్వీకరించాలని, అర్హులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసుకున్న వారికి జీఓ నంబర్ 30పై అవగాహన కల్పించి రెగ్యులైజేషన్ చలానా కట్టించాలన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులపై ప్రజలిచ్చిన అర్జీలను గడువులోపు పూర్తి చేసేలా చూడాలన్నారు.

అనధికార లేఅవుట్లపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఅవుట్లను గుర్తించి వాటిపై ప్రజలకు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకంపై యజమానులకు అవగాహన కల్పించి, ప్రక్రియ అమలును వేగవంతం చేయాలని సూచించారు. అనుమతుల్లేని కట్టడాల నిర్మాణాలను తొలి దశలోనే గుర్తించి అడ్డుకోవాలని తెలిపారు. రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి కనిపిస్తే నోటీసులను జారీ చేసి అపరాధ రుసుము వసూలు చేయాలని పేర్కొన్నారు.

⇨ నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి విలువైన సూచనలను ఆహ్వానిస్తున్నామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. ప్రతినిధులు ధనుంజయ్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మహేష్, హర్షవర్ధన్, సాయిరామ్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డీటీ ఆనంద్, సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరపాలక సంస్థ పరిధిలోని కార్మికులు అతిత్వరలో సమ్మెను విరమించి తిరిగి విధుల్లో కొనసాగేలా వారికి సంబంధించిన అన్ని డిమాండ్లపై స్పష్టతను కల్పిస్తున్నామని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నుంచి ప్రకటనను విడుదల చేశారు.

⇨ దీర్ఘకాలంగా ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి నూరు శాతం వసూళ్లను సాధించేలా కృషి చేయాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. రెవెన్యూ శాఖతో సమీక్ష సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పెనుబర్తి నేత చిన్న మునెయ్య, పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, మోపూరు చంద్రశేఖర్‌రెడ్డి, మోపూరు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన



నెల్లూరు (టౌన్): డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకొని కీటక జనిత, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని సుబేదారుపేటలోని పీఎమ్మార్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీని జరిపారు. సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, శ్యామ్‌సన్, ఆరోగ్య సహాయకుడు సుభాన్, ఏఎన్‌ఎం ప్రతిమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో చేపట్టిన మహాకుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా మహాగణాధిపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కంచిపీఠ ఆస్థాన సిద్ధాంతి విజయసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపుర పునర్నిర్మాణ దాత ఆల్తూరు సులోచనమ్మ, నవగ్రహ మండప దాతలు పసుపులేటి సుబ్రహ్మణ్యం, నరసింహరావు, ఈఓ జనార్దన్‌రెడ్డి, ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి పాల్గొన్నారు.

పాటలు, నృత్య పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి పాటలు, డ్యాన్స్ పోటీలు, నృత్య ప్రదర్శనలను నగరంలోని పురమందిరంలో గురువారం నిర్వహించనున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను టౌన్‌హాల్లో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాల్గొనాలనుకునే కళాకారులు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రఘురామిరెడ్డి, అమానుల్లాఖాన్, ముత్యాల రవీంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా బంగారు కుటుంబాల దత్తత



సీఈఓ రాజశేఖర్‌కు సత్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా మూడు కుటుంబాలను చింతారెడ్డిపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ పరిధిలో దత్తత తీసుకున్నారు. స్థానిక పీఏసీఎస్ సీఈఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీఓ గుర్రప్ప మాట్లాడారు. దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు మార్గదర్శకంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన నైపుణ్యాలను తెలియజేయాలని కోరారు. జిల్లాలో 200 బంగారు కుటుంబాలను సహకార శాఖ ద్వారా దత్తత తీసుకునేలా కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం రాజశేఖర్‌ను సత్కరించారు. డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బూదాటి రాధయ్యకు పరామర్శ



నెల్లూరు(బృందావనం): మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య సతీమణి సామ్రాజ్యం(75) మంగళవారం కన్నుమూశారు. ఈ క్రమంలో వేదాయపాళెంలోని వెంకటరెడ్డినగర్‌లో గల ఆయన నివాసానికి పలువురు వెళ్లి పరామర్శించారు. ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. పద్మశాలి సంఘ జిల్లా నేతలు బుధవరపు బాలాజీ, సోమా గోపాల్, చింతలపూడి పెంచలయ్య, దోనేపూడి కోటేశ్వరరావు, గుత్తికొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని కమిషనర్ నందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ స్రవంతి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొననున్నారని చెప్పారు.

నిధుల దుర్వినియోగంలో బాధ్యులెవరో తేల్చాలి

నెల్లూరు రూరల్: హౌసింగ్ ఎండీ కార్యాలయం ద్వారా దుర్వినియోగమైన నిధులకు బాధ్యులెవరో తేల్చాలని బీజేపీ నేత మిడతల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భారీ కుంభకోణం జరుగుతున్నా, పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

నెల్లూరు(బారకాసు): సమ్మెను మున్సిపల్ కార్మికులు విరమించారని కమిషనర్ నందన్ తెలిపారు. మున్సిపల్ కార్మిక సంఘాల నేతలతో చర్చలను కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొమ్మిదో డివిజన్లో కాంట్రాక్ట్ విధాన అమలుపై మంత్రి నారాయణ స్పష్టతివ్వడంతో కార్మికులు సమ్మెను విరమించారని కమిషనర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన కాంట్రాక్ట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేసి నూతన విధి విధానాలపై పునరాలోచించేందుకు మంత్రి నారాయణతో కార్మిక సంఘాల నేతలు భేటీ కానున్నారని పేర్కొన్నారు. నేతలు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, పెంచలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.


నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

నెల్లూరు సిటీ: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని డీఎస్పీ రామారావు పేర్కొన్నారు. కనుపర్తిపాడు సమీపంలోని ఇథాకా ఇంటర్నేషనల్ స్కూల్లో ఇన్వెస్టిచర్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన విద్యార్థి నేతలు బాధ్యతలను స్వీకరించారు. పాఠశాల జీఎం జీవన్, ప్రిన్సిపల్ శోభన లక్ష్మీనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆటోనగర్ సబ్‌స్టేషన్‌ను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, సర్క్యూట్ బ్రేకర్లు, అంతరాయాలు తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్లో రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి.. అంతరాయాల్లేని విద్యుత్‌ను అందించాలని కోరారు. నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, డీఈఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాలతో భేటీ





నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తదితరులు మంగళవారం కలిశారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనపై చర్చించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో సీనియర్ న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

విద్య పరిరక్షణకు సంతకాల సేకరణ



నెల్లూరు (టౌన్): ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని కోరుతూ సంతకాల సేకరణను నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో ఇండియన్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్‌ఓ జిల్లా ఇన్‌చార్జి సురేష్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల సంతకాలను సేకరించనున్నామని చెప్పారు. నగరాధ్యక్షుడు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం



సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ పెద్దాస్పత్రిలోని పీపీ యూనిట్‌లో మెడికల్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు అందించిన సేవలను డీఎంహెచ్ఓ సుజాత, ఏఓ నిశాంత్ కొనియాడారు. ఇస్కపాళెం పీహెచ్‌సీకి బదిలీపై ఆయన వెళ్తున్న సందర్భంగా ఆత్మీయ సన్మాన సభను నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్లు శేషమ్మ, శ్రీరామ్‌కుమార్, ఏపీ హంస గౌరవ సలహాదారు పరిమళ, జిల్లా నేతలు మజరుల్లా, గౌస్‌బాషా, సుధాకర్‌రెడ్డి, సుకన్య, మంజరి, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోటీగా కార్మికుల ఏర్పాటు తగదు



డీవైఎఫ్ఐ, ఐద్వా నేతల ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో, వారికి పోటీగా కార్మికులను ఏర్పాటు చేసి పనులు జరిపించడం తగదని డీవైఎఫ్ఐ, ఐద్వా నేతలు నరసింహ, శివకుమారి పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు మద్దతుగా నగరంలో ర్యాలీని డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కార్మికుల వేతనాలను కాంట్రాక్టర్ల ద్వారా అందజేసే ప్రక్రియను విరమించాలని డిమాండ్ చేశారు. నేతలు తిరుపతి, జగదీష్, శ్రీను, బాలు, సురేంద్ర, సుబ్బమ్మ, ఆదిలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



విజయన్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్‌కు వినతిపత్రాన్ని యూనియన్ నేతలతో కలిసి మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలో 2007లో అప్పటి సీఎం వైఎస్సార్ విలీనం చేసిన అంశాన్ని గుర్తుచేశారు. కాంట్రాక్ట్ కార్మికులను ప్రస్తుతం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్‌కు వినతిపత్రమిచ్చారు. నేతలు పెంచలప్రసాద్, నాగయ్య, దయాకర్, ప్రసన్న, మనోజ్‌కుమార్, సునీల్, శ్రీనివాసులు, ఆరిఫ్, వసంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్త



మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలోని వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. కాలువల్లో మురుగు నిల్వ ఉంటోంది. రోడ్లన్నీ చెత్తతో దర్శనమిస్తున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు(వీఆర్సీ సెంటర్)

